
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



సూర్యాపేట

5

శుక్రవారం 2 ఆగస్టు 2024

గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.2

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	538.80 (185.8360)	4,91,022	30,368
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.90 (3.78)	453.93	540.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.73 (1.11)	162	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.210

» నీళ్లు



జిల్లాలోని సాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు భిన్న పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సాగర్‌కు ఎగువ నుంచి వరద వస్తుండటంతో శుక్రవారం ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తుండటం ఆ ఆయకట్టు పరిధిలోని రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. గతేడాది నుంచి నీటి ఎద్దడితో క్రాప్ హాలిడే ఎదుర్కొన్న ఆయకట్టుకు సకాలంలో నీరందడం మరింత ఆనందాన్ని ఇస్తోంది. ఇక శ్రీరాంసాగర్ రెండో దశ ఆయకట్టులో ఇందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. ఎగువన రిజర్వాయర్లలో నీటినిల్వలు లేకపోవడం, వర్షాలు సరిగా కురవకపోవడంతో సాగు నీటి కోసం రైతులు ఎదురుచూడక తప్పడంలేదు. డీబీఎం-71 పరిధిలో సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు దుక్కులు దున్ని నీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

కన్నీళ్లు «



అర్వపల్లిలో సాగుకు సిద్ధంగా ఉన్న భూములు

ఆయకట్టులో ఆనందం

- నేడు సాగర్ ఎడమ కాల్వకు నీటివిడుదల
- ఇప్పటికే నారుమడులు పెంచిన రైతులు
- ఓ వైపు రుణమాఫీ, మరోవైపు నీటివిడుదలతో సర్వత్రా హర్షం

నల్లగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) / నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టు రైతుల్లో సందడి మొదలైంది. ఓ వైపు రుణమాఫీ అమలుతో బ్యాంకుల నుంచి రుణవిముక్తి కలుగుతుండటం, మరోవైపు వానాకాలం సాగుకు సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువన కురిసిన భారీ వర్షాలతో కృష్ణానది వరద సాగర్‌కు వచ్చిచేరుతోంది. దీంతో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎడమకాల్వకు లాంఛనప్రాయంగా నీటిని విడుదల చేయనున్నట్టు భారీ నీటిపారుదలశాఖ ప్రకటించింది. దీంతో ఈ సీజన్‌లో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పంటలు సాగుచేసుకునే వెసులుబాటు సాగర్ ఆయకట్టు రైతులకు దక్కింది.

6.50 లక్షల ఎకరాల్లో వరి సాగుకు గ్రీన్‌సిగ్నల్

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తుండడంతో ఆయకట్టు పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని 6.50లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో సాగర్ ఎడమకాల్వ విస్తరించి ఉంది. ఆయకట్టులో ఇప్పటికే బోరుబావుల కింద నారుమడులు చేయగా, కాల్వకు నీటిని విడుదలచేయగానే దుక్కులు తడిపి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు వ్యవసాయశాఖ రెండు జిల్లాల్లో ఎరువుల కొరత లేకుండా అవసరమైన యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఇప్పటికే అందుబాటులో ఉంచడంతో పాటు, బఫర్ స్టాక్‌ను సిద్ధం చేసింది. కాల్వకు నీటిని విడుదల చేసిన 15 రోజుల్లోపే ఎడమకాల్వపై, అనుబంధంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టుకు కూడా నీటిని విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టు రైతులు సాగు పనులకు శ్రీకారం చుట్టారు.

సంవత్సరం	నీటి విడుదల తేదీ	నాటి నీటిమట్టం (అడుగుల్లో)	నీటినిల్వ (టీఎంసీల్లో)
2014	ఆగస్టు 06	515.80	141.73
2015	అక్టోబరు 18	510.20	132.01
2016	ఆగస్టు 26	514.20	138.91
2017	నవంబరు 1	576.80	273.81
2018	ఆగస్టు 24	562.60	238.47
2019	ఆగస్టు 12	556.00	223.19
2020	ఆగస్టు 8	557.60	226.83
2021	ఆగస్టు 2	587.60	305.62
2022	జూలై 29	552.80	215.98
2023	క్రాప్‌హాలిడే	-------	-------

నేడు ఎడమకాల్వకు నీటిని విడుదలచేయనున్న మంత్రులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండడంతో ఆయకట్టుకు నీరివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం మధ్యాహ్నం 3.40గంటలకు ఎడమకాల్వ హెడ్ రెగ్యులరేటర్ (పొట్టిచెలమ)వద్ద మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నీటిని విడుదల చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ కోటిరెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో సాగర్‌కు చేరుకుంటారని, కార్యక్రమ అనంతరం డ్యామ్‌ను సందర్శించి, విజయవిహార్ అతిథిగృహం వద్ద తేనీటివిందులో పాల్గొంటారని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు.

ఆందోళన

జిల్లా పరిధిలోని శ్రీరాంసాగర్ రెండో దశ ఆయకట్టు రైతులు గోదావరి నీటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రధాన ఆయకట్టు కింద సుమారు 80 వేల ఎకరాల్లో దుక్కులు దున్ని సాగుకు పొలాలను సిద్ధం చేశారు. కాల్వల్లోకి నీరు ఎప్పుడు వస్తుందా, నారు పోసి, నాట్లు వేయాలన్న ఆశతో ఉన్నారు. అదేవిధంగా బోరుబావుల కిందట సుమారు 20వేల ఎకరాల్లో సాగును చేపట్టారు. అయితే వానాకాలం సీజన్ మొదలై రెండు నెలలు గడుస్తున్నా అటు ఆశించిన స్థాయిలో వర్షాలు, ఎస్సారెస్పీ కాల్వల్లోకి నీళ్లు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

- అర్వపల్లి

ఎస్సారెస్పీ రెండోదశ కిందట జిల్లాలోని 2.44 లక్షల ఎకరాల సాగు లక్ష్యంతో 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలు, ఉపకాల్వలు తవ్వారు. వీటి పరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని 14 మండలాలకు చెందిన 203 గ్రామాలకు 320 చెరువులు, కుంటలకు ప్రతి ఏటా వానాకాలం, యాసంగి సీజన్లకు నీటిని అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో ఒక్క డీబీఎం-71 పరిధిలోనే 80 వేల ఎకరాల్లో రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేశారు. అదేవిధంగా బోరుబావుల కింద 20 వేల ఎకరాల్లో సాగును ప్రారంభించారు. వీరంతా గోదావరి నీటి కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో జూలై చివరి వారం నుంచి ఆగస్టు మొదటి వారంలోగా కాల్వలకు నీటి విడుదల జరిగేది. వారబందీ పద్ధతిలో కాల్వలకు నీటిని విడుదలచేసేవారు. అయితే గత రెండేళ్లుగా సరైన వర్షాలు లేకపోవడంతో స్థానికంగా చెరువులు, కుంటల్లో కూడా నీటి లభ్యత లేదు. దీంతో గోదావరి నీటి కోసం రైతులు ఎదురుచూడక తప్పడం లేదు.



కాగితాలకే పరిమితం

ఎస్సారెస్పీ రెండో దశ కింద కాల్వలు, ఉపకాల్వల మరమ్మతుల కోసం గత ప్రభుత్వం పునర్జీవ పథకం ప్రకటించింది. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో ఉన్న రుద్రమ్మచెరువు, వెంపటి, గొట్టిపర్తి, బండారామారం చెరువులను నీటి సామర్థ్యం పెంచి రిజర్వాయర్లుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ఎస్సారెస్పీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

ఎగువన రిజర్వాయర్లు నిండితేనే

జనగాం జిల్లా కొడకండ్ల వద్ద ఉన్న బయ్యన్నవాగు నుంచి నీటి విడుదల చేస్తే జిల్లాలోని తిరుమలగిరి మండలం వెలిశాల సమీపంలోని 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలకు నీరు చేరుకుంటుంది. అయితే ప్రస్తుతం బయ్యన్నవాగుతో పాటు ఎగువ ఉన్న మైలవరం, మిడ్ మానేరుల్లో తగిన స్థాయిలో నీటినిల్వలు లేకపోవడంతో దిగువకు నీటిని విడుదల చేయడం లేదు. అదేవిధంగా ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 90 టీఎంసీలకు 34 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. వరద పెరిగితే కానీ నీటి విడుదలకు అవకాశం లేదు.

అధ్వానంగా కాల్వలు

శ్రీరాంసాగర్ కాల్వలు అస్తవ్యస్తంగా చెట్లపొదలతో మట్టి పూడుకపోయి అధ్వాన్నంగా తయారయ్యాయి. దీంతో నీటి విడుదల సమయంలో 30 శాతం నీరు వృథాగా పోతోంది. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం, అర్వపల్లి, కుంచమర్తి, తిమ్మాపురం గ్రామాల సమీపంలోని ఉపకాల్వలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. శ్రీరాంసాగర్ మెయిన్‌కాల్వలు 150 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఎనిమిదేళ్ల కిందట శ్రీరాంసాగర్ ఆధునికీకరణ కోసం రూ.300కోట్ల నిధులు కేటాయించినా విడుదల కాలేదు దీంతో రూ.12కోట్లతో నాగారం మండలం నుంచి జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం వరకు లైనింగ్ పనులు తూతూమంత్రంగా చేపట్టి వదిలేశారు. రూ.2కోట్లతో 45తూములను మరమ్మతులు ప్రారంభించినా నేటికి పూర్తి కాలేదు. కాసర్లపాడు గ్రామపంచాయతీలో 12 గొలుసుకట్టు చెరువులు ఉన్నా నేటికీ నీరు అందడంలేదు. 500మీటర్ల ఉపకాల్వలకు నిధులు కేటాయిస్తే చెరువులు నిండే అవకాశం ఉంది.

ఆయకట్టు చివరి భూములకు నిరాశే

ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టు చివరన జిల్లాలోని చివ్వెంల, నూతనకల్, మోతె, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), నడిగూడెం, గరిడేపల్లి మండలాల్లోని భూములు ఉన్నాయి. అయితే ఐదేళ్ల నుంచి వారబందీతో వానాకాలం, యాసంగి సీజన్లలో 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నా చివరి భూములకు నీరు అందిన దాఖలాలు లేవు. నీరు అందడం లేదని రైతులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా, ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. అయితే భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షిస్తున్న కోదాడ నియోజకవర్గ పరిధిలో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములు ఉండటంతో ఈ పర్యాయమైనా నీటి విడుదల జరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ప్రాజెక్ట్ నిండితే నీటి విడుదలకు అవకాశం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండితే నీరు విడుదల చేసే అవకాశం ఉందని ఎస్సారెస్పీ ఏఈ హరిస్వరూప్ తెలిపారు. ఉపకాల్వల్లోని పిచ్చిమొక్కలను ఉపాధిపథకం కింద తొలగించాలని పైఅధికారులకు నివేదికలు పంపించామన్నారు.

గోదావరి జలాల కోసం పడిగాపులు



గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నాం. మెయిన్, ఉపకాల్వల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. నీటి కోసం భూమిని దున్ని సిద్ధంగా ఉంచాం. శ్రీరాంసాగర్ నిండి, నీటి విడుదల జరగాలి.

-బాణోత్ నాగులు, రైతు, మేడిబాయి తండా,అర్వపల్లి మండలం

ఐదు రోజులు స్వచ్ఛదనం- పచ్చదనం

● 5వ నుంచి 9 వరకు నిర్వహణ ● వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



సీఎస్ శాంతికుమారితో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 1 : రాష్ట్రంలో ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రోజుకే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆమె ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆమె సమీక్షించారు. పారిశుధ్యం, గ్రీనరీ పెంచడమే లక్ష్యంగా గ్రామాల్లో, పట్టణాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహిస్తున్నట్లు వివరించారు. 5వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించడం, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం 7న మురికి కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు, 9న డ్రైడే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సతీష్ కుమార్, జడ్పీ సీఈవో అప్పారావు, డీఎంహెచ్‌వో కోటా చలం, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, డీఈవో అశోక్, శిరీష, మునిసిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇప్పుడా వచ్చేది?.. కలెక్టరేట్‌కు వచ్చి కలవండి

నడిగూడెంలో ఆలస్యంగా వచ్చిన వైద్యుడిపై కలెక్టర్ ఆగ్రహం



గడియారంలో టైంచూస్తూ ఆలస్యంగా వచ్చారని వైద్యుడిని ప్రశ్నిస్తున్న కలెక్టర్

నడిగూడెం, ఆగస్టు 1 : విధులకు ఆలస్యంగా వచ్చిన వైద్యుడిపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నడిగూడెం రెండు గంటలకు పైగా పర్యటించిన కలెక్టర్ వివిధ కార్యాలయాలు, పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వెళ్తుండగా వైద్యుడు ఒకరు అప్పుడే వస్తుండటం గమనించారు. ఇప్పుడా వచ్చేది అంటూ గడియారంలో టైం చూస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా కలెక్టరేట్‌కు వచ్చి తనను కలవాల్సిందిగా ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కొద్దిసేపు పాఠశాలను బోధించారు. స్థానిక యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఫర్టిలైజర్ దుకాణంలోని రికార్డులను పరిశీలించారు. హైస్కూల్‌ను తనిఖీ చేశారు. తరగతి గదికి ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉండటం ఏంటని ప్రశ్నించారు. అక్కడి నుంచి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. ఎడమకాల్వ కట్టపై ఉన్న సంపదవనాన్ని పరిశీలించి కొన్ని మొక్కలు నీటి వసతి లేకపోవడంతో ఉపాధిహామీ ఈసీ, టీఏలను మందలించారు.

పోషకాలతో కూడిన ఆహారం అందించాలి

మునగాల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండలంలోని క్రిష్ణానగర్, బరాఖత్‌గూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. క్రిష్ణానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నపిల్లలతో ముచ్చటించారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. అనంతరం బరాఖత్‌గూడెంలోని సంపదవనాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్, ఎంపీవో భూపాల్‌రెడ్డి, ఏపీవో శైలజ, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కవిత సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యాన్ని తెలియజేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్): తల్లిపాల ప్రాముఖ్యాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో పోషణఅభియాన్‌లో భాగంగా తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 7వతేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నర్సింహారావు, షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి లత, జేడీఏ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఎమ్మెల్యేలకు సీఎం క్షమాపణ చెప్పాలి



సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేట(కలెక్టరేట్) / కోదాడ టౌన్ / తుంగతుర్తి / మద్దిరాలు / హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 1 : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ మహిళా నాయకురాలతో కలిసి నిరసన తెలిపి, మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కించపరిచేలా సభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడటం దారుణమన్నారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల లవకుశ, నిమ్మల స్రవంతి, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్, జడీ భిక్షం, నెమ్మాది భిక్షం, బాలసైదులుగౌడ్, వై వెంకటేశ్వర్లు, ఉప్పల ఆనంద్, సల్మా, కరుణశ్రీ, అంజమ్మ, కల్లెపల్లి మహేశ్వరీ, బత్తుల ఝాన్సీ, మాజీ కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు. కోదాడలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పిట్టల భాగ్యమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముత్తవరపు రమేష్, మాజీ ఎంపీటీసీ గంట శ్రీనివాస్, నాయకులు, విష్ణువర్ధన్‌రావు, పాపారావు, వెంకట్‌రెడ్డి, సుంకర అభినాయుడు, కాసాని మల్లయ్యగౌడ్, చలికంటి వెంకట్, గోపి, రాహుల్ పాల్గొన్నారు. తుంగతుర్తిలో నల్లబ్యాడ్జీలు ధరించి బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గుండగాని దుర్గయ్య, మట్టిపల్లి వెంకట్, పోలెపాక సోమయ్య, గోపగాని శ్రీనివాస్, మల్లెపాక వెంకన్న, తడకమళ్ల రవి, చింతకుంట్ల మనోజ్ ఉన్నారు. మద్దిరాల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ రజాక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బెజ్జంకి శ్రీరాంరెడ్డి, పాతూరి లింగారెడ్డి, వడ్డాణం మధుసూదన్, సూరినేని తిరుమల్‌రావు, సూరారపు రాజు, సుంచు అవిలయ్య, మారెల్లి యాకయ్య, రేసు వెంకన్న, గంగవెల్లి రాజేంద్రప్రసాద్, ఉమామహేశ్వర్, సంజీవరెడ్డి, రేసు ఉపేందర్, అమృతారెడ్డి, భద్రారెడ్డి పాల్గొన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలు శోచనీయమన్నారు. సమావేశంలో రత్నశ్రీ, రత్నకుమారి, హుస్సేనమ్మ, లక్ష్మి, భవాని, ఉష, నాగమణి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు



ఎస్సీ వర్గీకరణ న్యాయమైనదేనంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడాన్ని హర్షిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు.

8లో

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్



లక్కవరంలో ఆరోగ్యసిబ్బందితో మాట్లాడుతున్న అమర్‌సింగ్

హుజూర్‌నగర్, ఆగస్టు 1 : విషజ్వరాలు, సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్, జిల్లా వైద్యాధికారి కోటా చలం అన్నారు. గురువారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. అనంతరం లక్కవరం గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. డెంగీ నివారణకు కృషి చేయాలన్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు డ్రైడే గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్, నాజియా, పుష్పలత, మోతీలాల్, ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాసరాజు, పద్మ, ఉదయగిరి శ్రీను, నూర్జహాన్‌బేగం పాల్గొన్నారు.

నాణ్యతతో కాల్వలైనింగ్ పనులు చేయించాలి



లైనింగ్ పనులను పరిశీలిస్తున్న నరేందర్‌గౌడ్, నర్సయ్య

మేళ్లచెర్వు, ఆగస్టు 1 : నాగార్జునసాగర్ కాల్వ లెవలింగ్ పనుల్లో నాణ్యత లోపించి, నాసిరకంగా పనులు జరుగుతున్నాయని ప్రజా కళాకారుడు బారె నర్సయ్య, ఓయూ జేఏసీ నాయకుడు నరేందర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. చింత్రియాల మేజర్ కాల్వ పరిధిలోని పీక్లానాయక్‌తండా పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఎన్ఎస్పీ కాల్వ లెవలింగ్ పనులను గురువారం వారు పరిశీలించారు. నాణ్యతతో జరగాల్సిన పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, ఎటువంటి లెవలింగ్ లేకుండా కాంట్రాక్టరు ఇష్టానుసారంగా అడుగుభాగాన లెవలింగ్ లేకుండా ఎగుడు దిగుడుగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. లైనింగ్ పనులు కొన్నిచోట్ల మధ్యలో నిలిపివేశారని అధికారులు తక్షణమే స్పందించి కాంట్రాక్టరుపై చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చూడాలన్నారు. మరో రెండు రోజుల్లో కాల్వలకు నీరు రానుండటంతో లెవలింగ్ పనులను నిలిపివేయాలని కోరారు. కాల్వలకు నీరు వస్తున్న తరుణంలో హడావుడిగా కాల్వపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి ఇవ్వడంపై అనుమానం వ్యక్తం చేశారు. పంట కాలం పూర్తయ్యే వరకూ కాల్వ మీద బ్రిడ్జి నిర్మాణ పనులను నిలిపివేసి రైతులకు సాగునీరు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ

● 15మంది ప్రయాణికులకు గాయాలు

గరిడేపల్లి, ఆగస్టు 1: ట్రావెల్స్ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొని 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం పట్టణానికి చెందిన జైశ్రీరాం టూర్ అండ్ ట్రావెల్స్ బస్సులో విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ జిల్లాలకు చెందిన 21 మంది సాయి భక్తులు మినీబస్సులో గత నెల 24వ తేదీన షిర్డీ వెళ్లి, తిరుగు ప్రయాణంలో పలు సాయి దేవాలయాలు దర్శించున్నారు. తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం సాయంత్రం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామ శివారులో గల సాయిబాబా ఆలయాన్ని సందర్శించుకున్నారు. అక్కడి నుంచి హుజూర్‌నగర్ వైపువెళ్తుండగా గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారి గూడెం గ్రామశివారులోని కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై గల పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా హుజూర్‌నగర్ వైపు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ మార్గంలోకి ట్రావెల్ బస్సు వెళ్లి లారీని ఢీకొంది. వైజాగ్‌కు చెందిన బస్సు డ్రైవర్ జోగారావు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు.



కీతవారిగూడెం వద్ద ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు, లారీ

స్థానికుల సహాయంతో అతనిని బయటికి తీశారు. అసిస్టెంట్ డ్రైవర్ హరికుమార్ కాలికి గాయమైంది. మరో ప్రయాణికుడి తలకు గాయాలయ్యాయి. వీరితో పాటు మరో 13మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ నల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణానదిలో ఈత కొడుతూ వ్యక్తి గల్లంతు


యాదయ్య(ఫైల్)

చిట్యాల, ఆగస్టు 1: దైవదర్శనం నిమిత్తం శ్రీశైలం వెళ్లిన నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన వ్యక్తి కృష్ణానదిలో ఈత కొడుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. చిట్యాల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య(65) హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య ఎల్లమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు మల్లికార్జునస్వామిని దర్శించుకుందామని గురువా రం తెల్లవారుజామున 10మంది సహచర హమాలీలతో ఓ వాహనంలో అక్కడికి బయలుదేరారు. ఎనిమిది గంటలకు శ్రీశైలంలోని దోమలపెంట చేరుకుని స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి దిగారు. ఈత కొడుతుండగా ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో యాదయ్య కొట్టుకుపోయాడు. అక్కడేఉన్న సహచరులు పోలీసులకు సమాచారం ఇవ్వగా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.





ఇదీ జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు– ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.







సబ్‌రిజిస్ట్రార్ల బదిలీలపై దుమారం

● నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు ● జీరో సర్వీస్, స్పౌజ్ అమలులో ఆగమాగం ● మంత్రులకు ఫిర్యాదుల వెల్లువ

నల్లగొండ, ఆగస్టు 1: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం రాత్రి జరిగిన సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీలపై దుమారం చెలరేగుతోంది. బదిలీలపై నిషేదం విధించడానికి ముందు అన్యూహంగా జరిగిన ఈ బదిలీలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏకకాలంలో రాష్ట్రంలోని మిగితా జిల్లాలతోపాటు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో బదిలీలు జరిగాయి. సబ్ రిజిస్ట్రార్‌లతో పాటు చిట్స్ డిపార్ట్‌మెంట్ ఇతర విభాగాల అధికారులను కూడా బదిలీ చేశారు. బదిలీల విషయంలో గడువు పెంచడానికి ముందు సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీకి సంబంధించి ఒక జాబితా తయారు చేసి ఉత్తర్వులు ఇచ్చే ముందే గడువు పెంచడంతో మరో జాబితాను తయారు చేయడంతో పాటు మొదటి జాబితాను తారుమారు చేసి రెండో జాబితాకు ఆమోదముద్ర వేసినట్లు చర్చనడుస్తోంది. కావాలనే రాష్ట్రస్థాయిలో ఓ వ్యక్తి చక్రం తిప్పి బదిలీలను అస్తవ్యస్తం చేశాడని ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిబంధనలు ఉల్లఘించారని ఆరోపిస్తూ కొందరు అధికారులు ఇప్పటికే మంత్రులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ సమీపంలోని ఓ జిల్లాకు చెందిన అధికారి బదిలీల్లో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

జీవోల ప్రకారం బదిలీలు జరిగినట్టేనా?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు విభిన్నమైన నిబంధనలు జీవోలు ఉన్నాయి. రెండేళ్ల సర్వీస్ పూర్తికాని వారిని బదిలీ చేయవద్దని జీవో 80పేర్కొంటుండగా, జీరో సర్వీస్ ద్వారా సర్వీస్‌తో సంబంధం లేకుండా ఒక రోజు చేశాడా రెండు రోజులు పనిచేశాడా, నెల, రెండు నెలలా అనే తేడా లేకుండా జీరో సర్వీస్ అందరికీ స్థాన చలనం కల్పించాలి. కానీ నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ డివిజన్‌లో ఉన్న ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఎస్ఆర్‌ను మాత్రం ఎందుకు బదిలీ చేయలేదని పలువురు అధికారులు ప్రశ్నిస్తున్నారు. తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్ ఇచ్చారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్పౌజ్ విషయంలో ముగ్గురు నుంచి నలుగురు సబ్ రిజిస్ట్రార్‌లకు కూడా బదిలీల విషయంలో అన్యాయం జరిగిందని సమాచారం. జీవోలను పక్కన పెట్టి రాత్రికి రాత్రే బదిలీలు చేయడం ఎందుకు అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఆ నాలుగు కార్యాలయాల్లో ఖాళీలు ఎందుకో?

నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎస్ఆర్ పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఖాళీగా ఉంచడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టారు. ప్రస్తుతం బదిలీలపై నిషేదం ఉన్నందున కీలకమైన, అధికంగా డ్యాకుమెంట్లు నమోదయ్యే భువనగిరి, సూర్యాపేటలో ఇన్‌చార్జిలతో నడిపించాల్సి ఉంటుంది. రామన్నపేట, నకిరేకల్ కార్యాలయాలకు కూడా ఇన్‌చార్జి అధికారులను డిప్యూటేషన్‌లపై కేటాయించాల్సి ఉంటుంది. మిగతా ప్రాం తాల్లో బదిలీచేసి ఈ నాలుగు కార్యాలయాలను ఎందుకు పక్కన పెట్టారనే దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుకూలమైన వ్యక్తులకు అధిక ఆదాయం వచ్చే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కేటాయించి ఉపయోగపడని వారిని ప్రాధాన్యంలేని కార్యాలయాలకు కేటాయించారని వాపోతున్నారు.

జీరో సర్వీస్ ప్రకారమే బదిలీలు

జీరో సర్వీస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం బదిలీలు చేసింది. అవసరమైనచోట జీరో సర్వీస్ ద్వారా బదిలీలు చేశారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి అయింది. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, జీవోల ప్రకారం బదిలీలు జరిగాయి.

● రవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ (ఎఫ్ఏసీ)

బదిలీ చేయొద్దనడం విడ్డూరం

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అధికారులను బదిలీ చేయొద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అనడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలపై జూలై 30వ తేదీన ప్రభుత్వ విప్‌బీర్ల అయిలయ్య అసెంబ్లీలో మాట్లాడినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గుట్టలో గురువారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. గతంలో ఎమ్మెల్యే ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా ఉన్నప్పుడు దేవస్థానంలో అవినీతి అధికారులను బదిలీ చేయాలని అనేక అందోళనలు చేసిన అయిలయ్య ప్రస్తుతం బదిలీలు ఆరు నెలల పాటు వాయిదా వేయాలని అసెంబ్లీలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను అడగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆలయ ఉద్యోగులు స్థానికంగా ఉండకుండా ఎక్కువ మంది హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, వారికోసం విప్ మాట్లాడం సమంజసంగా లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు జరుగుతుంటే కేవలం యాదగిరిగుట్ట ఉద్యోగుల బదిలీలు ఎందుకు జరగవద్దని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రచ్చ శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, ఉట్కూరి అశోక్‌గౌడ్, గుంటిపల్లి సత్యం, అజిమీర కిషన్‌నాయక్, ఆకుల చంద్రమౌళి ఉన్నారు.

నల్లగొండ జిల్లా ఏసీగా సులోచన బాధ్యతల స్వీకరణ

నల్లగొండ కల్చరల్, భువనగిరి అర్బన్: నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా అన్నెపర్తి సులోచన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీగా పనిచేసిన మహేంద్రకుమార్ జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. అదేవిధంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా విధులు నిర్వహించిన వజ్జల లక్ష్మణాచార్యులు ఉప ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందారు.

బదిలీలపై వివరణ కోరిన కమిషనర్

భువనగిరి అర్బన్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బదిలీల ప్రక్రియ ఊపందుకుంది. ఈ విద్యాసంవత్సరం గడిచినందున బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని శాసనసభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరడంతో రాజకీయ దుమారం రేగింది. ఉద్యోగుల పైరవీల్లో భాగంగానే ఈనెల 5వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు తెలిసింది. బదిలీల ఆప్షన్ ఫారం సమర్పించిన 25మంది ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సమాచారం ఇవ్వాలని దేవాదాయ శాఖ కమిషనర్ కోరారు. ఈనెల 2వ తేదీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి రావాలని పిలుపు వచ్చినట్లు సమాచారం.

సుప్రీంకోర్టు తీర్పు మాదిగలకు పండుగ రోజు



సూర్యాపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కోదాడలో సంబురాల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 1: ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ న్యాయమైనదని సుప్రీంకోర్టు తీర్పు మాదిగలకు పండుగ రోజుతో సమానమని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండగడుపుల సూరయ్య మాదిగ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైనదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు తనవంతు కృషి చేస్తున్నారని తెలిపారు. ఖమ్మం క్రాస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ తెలంగాణ జిల్లా ఇన్‌చార్జి పడిదల రవికుమార్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జానయ్యదుబ్బ రమేష్, పవన్, నాగరాజు, కనుకు రాజేష్, మురళి, చింత సైదులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి చింత జాన్‌విల్సన్ ఆధ్వర్యంలో, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు, యాతాకులు రాజయ్య ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఊట్కూరి జానకిరాములు, పిడమర్తి ప్రసాద్, శ్యాం, రాము, లింగయ్య, వెంకన్న,చింతలపాటి చినశ్రీరాములు, ఎర్ర వీరస్వామి, పుట్టల మల్లేష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మీసాల శరత్, కిరణ్‌కుమార్, గల్లా వెంకటేశ్వర్లు, సుదర్శన్, పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రంలో జైభీం మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో నాగార్జున, రవి, శేఖర్, పవన్, గురేష్, వెంక టేశ్, సైదులు, దావీద్, వేణు, వినోద్, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

కోదాడ టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో తీర్పు ఇచ్చిన ఆరుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాబాబు మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోదాడలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల చిన్న, నడిగూడెం ఎంపీపీ యాతాకుల జ్యోతి, రంగయ్య, కౌన్సిలర్ యాదగిరి, దేవపంగు బాబు, పిడమర్తి బాబురావు పాల్గొన్నారు.

కోదాడ: పట్టణంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు, ఏపూరి రాజు, గాలి శ్రీనివాస్‌నాయుడు, కొండపల్లి ఆంజనేయులు, సత్యం, రాజు, రవినాయక్ పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్డేపట్టి కోటేష్, మల్లెపంగు సూరిబాబు, శ్రీను పాల్గొన్నారు.

తుంగతుర్తి: నియోజకవర్గ కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారుఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకుడు మిట్టగడుపుల పురుషోత్తం, బోంకూరి భిక్షం, ఎం.రవీందర్, సాయిబాబా, ముత్తిలింగం పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకుడు జేరిపోతుల శ్రీకాంత్, ఎమ్మార్పీస్ నాయకులు పల్లెర్ల సురేష్, గోల్కొండ సైదులు, జె.శ్రీధర్, వెంకటేష్, గణేష్, ప్రశాంత్, గిరి, నవీన్ పాల్గొన్నారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామంలో మాదిగ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్ర మల్లేశం, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు వెంకన్న, బొడ్డు వెంకటనర్సు, చెర్కుపల్లి లక్ష్మణ్, బొడ్డు రమేష్, జీడి భాస్కర్, బొడ్డు కృష్ణయ్య, వెంకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తుంగతుర్తిలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



తిమ్మాపురంలో సంబురాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మట్టపల్లి ఆలయ అర్చకుడు మృతి



లక్ష్మీనరసింహమూర్తి (ఫైల్ ఫోటో)

మఠంపల్లి, ఆగస్టు 1: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ అర్చకుడు పరాశరం లక్ష్మీనరసింహమూర్తి(63) గురువారం మృతి చెందారు. రెండు దశాబ్దాల నుంచి మట్టపల్లి దేవస్థానంలో పూజారిగా పనిచేయడంతో పాటు మంచ్యా తండాలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయం పూజారిగా, ఉమ్మడి భీల్యానాయక్ తండాలో అర్చకత్వం నిర్వ హిస్తున్నారు. మట్టపల్లి దేవస్థానంలో నరసింహ దీక్షాదారులకు స్వామి మాలలు వేస్తూ ప్రచారం కల్పించారు. లక్ష్మీనరసింహమూర్తి మృతికి ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



చరణ్

పాలకవీడు, ఆగస్టు 1: పాఠశాలకు వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పాలకవీడు మండలంలో గురువారం జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన గుత్తికొండ చరణ్ భవానీపురంలోని డీసీఎస్ ఫ్యాక్టరీలోని ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. జాన్‌సహాడ్ నుంచి డీసీఎస్ పాఠశాల ఐదు కిలో మీటర్ల దూరంలో ఉంది. చరణ్ ప్రతి రోజూ ఆటో లేదా, డీసీఎస్‌లో పనిచేసే సిబ్బంది వాహనాలపై లిఫ్ట్ అడిగి వెళ్తుండేవాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఇంట్లో నుంచి స్కూల్‌కు బయలుదేరిన చరణ్ సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. దంతో చరణ్ తండ్రి వెంకన్న స్నేహితులను ఆరాతీశాడు. చరణ్ ద్విచక్ర వాహనాన్ని లిఫ్ట్ అడిగి మార్గమధ్యలో ఉన్న జాన్‌పహాడ్ దర్గా వద్ద దిగినట్లు తెలుసుకున్నాడు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చరణ్ తండ్రి వెంకన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన పలువురిపై కేసు

చివ్వెంల, ఆగస్టు 1: భూమిని ఆక్రమించడానికి యత్నించి ఫెన్సింగ్ తొలగించడంతో పాటు వాచ్‌మన్‌పై దాడి చేసిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన కొంద్ర సతీష్, చివ్వెంల మండలంలోని కుడకుడ గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 95, 98లో ఉన్న వెంచర్‌లో 2011లో 533 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. గత నెలలో ప్లాట్ చుట్టూ ఫెన్సింగ్ వేశాడు. కుడకుడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొట్టెటి సైదులు బుధవారం రాత్రి కొంత మంది వ్యక్తులతో ప్లాట్ వద్దకు వచ్చి ఫెన్సింగ్ తొలగించడంతో పాటు వాచ్‌మన్‌పై దాడి చేశారు. ఈ ఉదంతంపై బాధితుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొట్టెటి సైదులుతో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీవోలుగా హరిసింగ్, మారయ్య



హరిసింగ్



మారయ్య

నేరేడుచర్ల, నాగారం ఆగస్టు 1: నేరేడుచర్ల, నాగారం మండలాల పంచాయతీ అధికారులుగా జి.హరిసింగ్, కే.మారయ్య గురువారం బాధ్యతలు స్వీకరించాడు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎంపీవో విజయకుమారి నడిగూడెం మండలానికి బదిలీ అయ్యారు. మోతె నుంచి హరిసింగ్ బదిలీపై వచ్చారు.

నాగారం, ఆగస్టు 1: మండల పంచాయతీ అధికారిగా కె.మారయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. మారయ్య తిరుమలగిరి ఎంపీవోగా పనిచేస్తూ బది లీపై నాగారానికి వచ్చారు. ఇప్పటివరకు నాగారం ఎంపీవోగా విధులు నిర్వహించిన ధార శ్రీనివాస్ మున గాల ఎంపీడీవో కార్యాలయానికి బదీలి అయ్యారు.

ఎంపీడీవోగా సరోజ



గరిడేపల్లి, ఆగస్టు 1: ఎంపీడీవోగా ఆర్.సరోజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నల్లగొండ జిల్లా నేరేడుగొమ్మలో ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. గరిడేపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో శ్యాంసుందర్‌రెడ్డి స్థానంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

తిరుమలగిరి ఎస్ఐగా సురేష్



తిరుమలగిరి, ఆగస్టు 1: తిరుమలగిరి ఎస్ఐగా వి.సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమలగిరి ఎస్ఐగా పనిచేసిన సత్యనారాయణ వీఆర్‌కు అటాచ్ చేశారు. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండల ఎస్ఐగా పనిచేస్తున్న సురేష్ బదీలిపై తిరుమలగిరికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ తిరుమలగిరి మునిసిపాలిటీలో, మండలంలో శాంతిభద్రత పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేటటౌన్, ఆగస్టు 1: జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని గురువారం జిల్లా కేంద్రంలోని సిలోమి చర్చిలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాస్టర్ మీసాల గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ గడ్డం డేవిరాజ్, ఉపాధ్యక్షుడిగా రేమడాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కాపర్తి సైమన్, కోశాధికారిగా పూజర్ల సామేల్‌కిరణ్, జాయింట్ సెక్రెటరీగా కోయిలపగు సైమన్, కోఆర్డినేటర్‌గా లోతు చంద్రశేఖర్, మీడియా కన్వీనర్‌గా సామెల్సన్, కన్వీనర్‌గా మిర్యాల పాకిరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాంబాబు, పీటర్ నూతనంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మీసాల గోవర్ధన్ మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాసర్ల శ్రవణ్‌కుమార్, గుండు సాములు, ధరావత్ లాజర్‌నాయక్, ప్రభుదాస్, సుదర్శనం, సుధాకర్, శాంసన్, డేవిడ్‌రాజు, కరుణాకర్, లింగానాయక్, ఏసురత్నం, పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

● ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

హుజూర్‌నగర్, ఆగస్టు 1: కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసాచారి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, దేశ స్వాతంత్ర్య పోరాటంలో, చదువు..వెలుగు వంటి సామాజిక కార్యక్రమాల్లో, సంపూర్ణ మద్యపాన నిషేధం కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో ప్రజా నాట్యమండలి కళాకారులు కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నెలకు రూ.5వేలు పింఛను ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల ఏడో తేదీన ప్రజానాట్యమండలి రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దొంతగాని సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, ధనుంజయనాయుడు, కంబాల శ్రీనివాసు, కొప్పోజు సూర్యనారాయణ, గోపనబోయిన వెంకటేశ్వర్లు, మల్లయ్య, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కారింగుల వెంకన్న

సూర్యాపేట టౌన్, ఆగస్టు 1: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందజేయాలన్నారు. రైతుల పంట రుణాలను మాఫీ చేసి వెంటనే కొత్త రుణాలు అందజేయాలని, నిరుద్యోగుల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని జాబ్ క్యాలండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట, ఈనెల 8వతేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, గొడ్డలి నర్సయ్య, మారసాని చంద్రకళ, పిడమర్తి లింగయ్య, భూక్య రాంజీ, సూరం రేణుక, జయమ్మ, హుస్సేన్ గోగుల వీరబాబు, విజయ్, సంతోషిమాత, పద్మ మోహన్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు గుర్తింపు

గరిడేపల్లి, ఆగస్టు 1: అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని ఎంఈవో పానుగోతు ఛత్రునాయక్ అన్నారు. పొనుగోడు ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు అందె సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా సత్యనారాయణ దంపతులును గురువారం సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జోగు సరోజనమ్మ, హెచ్ఎం నర్సకుమారి, వెంకటరెడ్డి, సందీప్, బసవకోటేశ్వరరావు, కృష్ణారెడ్డి, సుధాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాండునాయక్



మఠంపల్లి, ఆగస్టు 1: తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని భీమ్లాతండాకు చెందిన భూక్య పాండునాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పాండునాయక్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా విగ్రహం ఊరేగింపు సందర్భంగా కోలాటం ఆడుతున్న భక్తులు

కోదాడ రూరల్, ఆగస్టు 1: మండలంలోని తమ్మర గ్రామంలోని షిర్డీ సాయిబాబా దేవాలయ ఏడో వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా సాయిబాబాకు కాకడ హారతిలో ఉత్సవాలు ప్రారంభించారు. అనంతం ఆలయంలో సాయిబాబా విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక సత్యవ్రత కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం 11గంటలకు సాయిబాబా ఉపదేశకుడు అమ్ముల సాంబశివరావు రచించిన షిర్డీ సాయి తత్వ బోధనల పుస్తకాలను భక్తులకు అందించి సత్సంగ ప్రమాణాలు చేయించారు. మధ్యాహ్నం కాకడ హారతిని నిర్వహించారు. అనంతరం సాయి బాబాను గ్రామంలో పల్లకిలో ఊరేగించారు. తదనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నిర్వాహకుడు కమతం రాము, తమ్మర, కోదాడ, లక్ష్మీపురం, గోండ్రియాల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్నేని వెంకటరత్నంబాబు

కోదాడ, ఆగస్టు 1: రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు అన్నారు. సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం కోదాడలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో రైతులకు మేలు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంతో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకున్నందుకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ప్రజల ఆదరణను చూసి తట్టుకోలేని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వంలో మూలనపడిన ఎత్తిపోతల పథకాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేసి పునరుద్ధరిస్తూ రైతులకు సాగునీరు అందిస్తున్నారని కొనియాడారు. రైతులందరూ కాంగ్రెస్ వెంటే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో సాధినేని అప్పారావు, చందు నాగేశ్వరరావు, పారా వెంకటేశ్వరరావు, నెమ్మాది దేవమణి, రాయల కృష్ణారావు, భాస్కర్‌రావు, వేమూరి విద్యాసాగర్, రాము, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: సాగర్ ఎడమ కాల్వకు ప్రభుత్వం నీటిని విడుదల చేయడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ గ్రామంలో ఆయన మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండనప్పటికీ రైతుల ప్రయోజనం కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.

గ్రామకంఠం భూములను కాపాడాలి: సీపీఐ



చిలుకూరులో ఎంపీడీవో, ఎస్ఐలతో మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు, ఆగస్టు 1: మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో గ్రామకంఠం భూమి ఆక్రమణకు గురవుతుందని, భూమిని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సిబ్బందిని బయటికి పంపి కార్యాలయానికి తలుపులు వేసి ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు జీపీ కార్యాలయంలోకి వెళ్లి విధులు నిర్వహిస్తుండడంతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆయనతో వాగ్వివాదానికి దిగారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్యను పరిష్కరించేంత వరకు కదిలేదిలేదని భీష్మించడంతో పంచాయతీ కార్యదర్శి కార్యాలయం నుంచి బయటికి వెళ్లారు.ఎస్ఐ సురభి రాంబాబు, ఎంపీడీవో గిరిబాబులు ఘటనా స్థలానికి చేరుకుని సీపీఐ నాయకులతో మాట్లాడి జీపీ కార్యాలయాన్ని తెరిపించారు. ఈ కార్యక్రమంలో రెమిడాల రాజు, కాంపాటి వెంకటయ్య, రామిశెట్టి కోటయ్య, అంజిరెడ్డి, హుస్సేన్, ఇబ్రహీం, మహేష్, సైదులు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సూర్యాపేట(కలెక్టరేట్): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యుల సాధారణ బదిలీలను పారదర్శకంగా నిర్వహించిన ప్రభుత్వానికి ధన్యవాదాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణచక్రవర్తి, నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్ నుంచి అధికారి వరకు బదిలీలు సజావుగా జరిగాయన్నారు.

సూర్యాపేట రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ సీహెచ్ శివప్రసాద్ అన్నారు. వీవై సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పిల్లలమర్రి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కుక్కలు కరిస్తే రేబీస్ వ్యాధి రాకుండా వెంటనే టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, వీరబాబు, కిషోర్ పాల్గొన్నారు.

● రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి సమస్యలపై రైతులకు అర్థమయ్యేలా చెప్పాలని, సాంకేతిక సమస్యలతో ఆగిన భూసమస్యలను రైతులు సమన్వయం పాటించి పరిష్కరించుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో డీటీ రుక్మోద్దిన్, ఆర్ఐలు శ్రీధర్, రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.1

పెన్‌పహాడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల వృత్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఈనెల 12వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బాడె నర్సయ్య, రావుల కృష్ణ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలక సోమయ్యగౌడ్ ఆరోపించారు. పట్టణంలోని భవన నిర్మాణ సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ బోర్డులో 25లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నా 10లక్షల మందికి కూడా న్యాయం జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి రాములు, వెంకన్న, రాంబాబు, ముస్తఫా, జయకృష్ణ, వీరస్వామి, రామకృష్ణ, గోవింద్, పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో కార్పెంటర్ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చేపూరి నర్సింహాచారి, అధ్యక్షుడిగా బ్రహ్మచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా ఉపేంద్ర, కోశాధికారిగా వీరాచారి, సహాయ కార్యదర్శిగా శ్రీపాద నర్సింహాచారి, శివ, శ్రావణ్, హరీష్, రాజశేఖర్, సంపత్, ప్రచార కార్యదర్శిగా దుర్గ, శ్రీనివాసాచారి, విజయ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమాచారి, రంగయ్య పాల్గొన్నారు.

నేరేడుచర్ల: తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి నాగిని అన్నారు. ఈ నెల ఒకటో తేదీన నుంచి ఏడో తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాల ఆవశ్యకతపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజ్యలక్ష్మి, ధనమ్మ, వెంకటేశ్వర్లు, నర్సయ్య, పుష్పావతి, వెంకటరమణ, ఉపేంద్ర, పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడబోతు గుర్వారెడ్డి అకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. గుర్వారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి అప్పయ్య, డి.వెంకటేశ్వర్లు, నిజాంవుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

కోదాడ: రైతు బంధు' ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. పంట రుణ మాఫీకి అనేక నిబంధనలు పెట్టినందున రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి రైతుకూ రుణ మాఫీని వర్తింజేయాలని కోరారు.

కోదాడ టౌన్: పట్టణంలోని 17వ వార్డులో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నాసర్‌సాహెచ్ కుమార్తె సైదాహుస్సేన్‌బీ వైద్యానికి కోదాడకు చెందిన న్యాయవాది కాకర్ల వెంకటేశ్వరరావు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా తన 60వ పుట్టినరోజు సందర్భంగా 17వ వార్డులో స్నేహితులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు, రామారావు, తోట రంగారావు, జీవి చారి, కాశీం, ముంద్ర రవి, నెల్లూరి వెంకటేశ్వర్లు, కొత్త రాంబాబు పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని గోరెంట్ల గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి మంగమ్మను చివ్వెంల మండలానికి బదిలీ చేశారు. మంగమ్మను గ్రామ పంచాయతీ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో కారోబార్ తొనుకునూరి వెంకన్న, సమ్మయ్య, సోమయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ శ్రీనివాస రావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు సక్రమంగా ఉండాలన్నారు. లబ్ధిదారులకు సరుకులను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీ వంశీరాజ్, డీలర్లు కాసోజు శంకర్, జహంగీర్, బుచ్చిమల్లు, అశోక్, మారయ్య పాల్గొన్నారు.

● ఇటీవల జరిగిన బదిల్లో వివిధ గ్రామాలకు నూతనంగా వచ్చిన కార్యదర్శులు గురువారం విధుల్లో నూతనకల్ ఎంపీడీవో సునీత తెలిపారు. లింగంపల్లికి బాణాల మధుసూదన్‌రెడ్డి, ఎడవెల్లి గ్రామానికి రాగి చలమయ్య, దిర్శనపల్లికి వెన్న వెంకట్‌రెడ్డి, బికుమళ్లకు ఆకుల ఉమేష్, వెంకేపల్లికి తాళ్లపల్లి వెంకన్న, అలుగునూరుకు నాతి రమేష్ కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారన్నారు.